సాక్షి నిజామాబాద్

ఆదివారం । 30 । జూలై । 2023



వరదొస్తే.. రాకపోకలు బంద్

మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తే సాలూర శివారులోని పాత వంతెన మునిగి అంత ర్రాష్ట్ర రవాణా నిలిచిపోతుంది.

- 8లో ▸



ఆర్టీవో ఆఫీస్ ఏర్పాటు చేస్తాం

బాల్కొండ నియోజకవర్గంలో ఆర్టీవో ఎక్స్‌టెన్సన్ ఆఫీసు ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.8 /22.9

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతమవుతుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గోదావరిలోకి నిలిచిన నీటి విడుదల




బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటి విడుదల నిలిపి వేశారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 60 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (90 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1089.7(83.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 34.47 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రాజెక్ట్ వద్ద సెల్ఫీలు దిగుతూ పర్యాటకులు సందడి చేస్తున్నారు.

ఎస్సారెస్పీని సందర్శించిన మిషన్ భగీరథ సీఈ



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను శనివారం మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ రాంచంద్ సందర్శించారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వలన గ్రామాల్లో దెబ్బతిన్న మిషన్ భగీరథ పైపు లైన్‌లను పరిశీలించి, ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఈఈ నరేశ్ బాబు, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేశ్, జిల్లా కోఆర్డినేటర్ రాంచందర్ తదితరులు ఉన్నారు.

'సాగర్'కు తగ్గిన ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమక్రమంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రానికి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 10 వేల క్యూసెక్కుల మేర వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. దాంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ రెండు వరద గేట్ల ద్వారా 10వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1404.68 అడుగులు 17.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పర్యాటకుల సందడి

నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ద్వారా నీటి మంజీర నదిలోకి విడుదల చేస్తుండటంతో శనివారం ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. పొరుగు రాష్ట్రాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తున్నారు. పర్యాటకుల పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించడంతో పలువురు స్పీకర్ పోచారం దృష్టికి తీసుకెళ్లగా పర్యాటకులను అనుమతించాలని స్పీకర్ పోలీసులను ఆదేశించారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి



సుభాష్ నగర్ : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. శనివారం ఆమె జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో ఫోన్లో వర్షాలపై సమీక్షించారు. ఎస్సారెస్పీ నీటి విడుదల, వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యం, ఆహారం, విద్యుత్, రోడ్డు సౌకర్యాల పునరుద్ధరణకు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు కంట్రోల్ రూం ద్వారా అధికారులను సంప్రదించాలని కోరారు. సహాయక చర్యలకు సంబంధించి అధికారులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలను సీఎం కేసీఆర్‌కు వివరించి పరిష్కారానికి కృషి చేస్తానని కవిత పేర్కొన్నారు. వరద ప్రాంతాలను సందర్శించి బాధితులకు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.

చేపల కోసం వేట..



న్యాల్‌కల్ గ్రామంలోని మాసాని చెరువు అలుగు వద్ద వల వేసి చేపలు పడుతున్న మత్స్యకారుడు





నాలుగైదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలోని చెరువులు అలుగులు పారుతున్నాయి. దీంతో వరద నీటికి ఎదురెక్కుతున్న చేపలను పట్టడంలో మత్స్యకారులు బిజీ అయ్యారు. మోపాల్ మండలం న్యాల్‌కల్ గ్రామంలోని మాసాని చెరువు అలుగు వద్ద మత్స్యకారులు ఇలా వలలు వేసి చేపలు పడుతున్నారు.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నేతల వరద పర్యటనలు

- ఇప్పటికే క్షేత్రస్థాయిలో తిరుగుతున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు
- వర్షాల నేపథ్యంలో కలిగిన నష్టాన్ని పరిశీలిస్తూ.. బాధితులకు పరామర్శలు
- దెబ్బతిన్న పొలాలు, కోతకు గురైన రోడ్లు, కూలిపోయిన ఇళ్లు, అలుగులు పారుతున్న చెరువుల చుట్టూ చక్కర్లు
- అధికారులతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిరంతరం సమీక్షలు

భారీ వర్షాల కారణంగా జిల్లాలో ప్రధాన పార్టీల నాయకుల రాజకీయ కార్యక్రమాలు వరద బాధిత ప్రాంత పర్యటనలుగా మారిపోయాయి. ప్రజా ప్రతినిధులు వర్షాలతో కలిగిన నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. బాధితులకు భరోసా ఇస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు బాధితులను పరామర్శిస్తూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.



ఏర్గట్ల శివారులోని తీగెల వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాయి. ఈ క్రమంలో వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా అతలాకుతలం అయ్యింది. పంటలు, ఆస్తి నష్టాలు సంభవించగా.. రెండుమూడు చోట్ల వ్యక్తులు వరద ప్రవాహంలో గల్లంతై మరణించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రధాన పార్టీల నాయకుల రాజకీయ కార్యక్రమాలు వరద పర్యటనలుగా మారిపోయాయి. వారం రోజుల క్రితం వరకు అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలకు వెళ్లి ప్రజలను కలిసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రస్తుతం తెగిన చెరువు కట్టలు, దెబ్బతిన్న పొలాలు, పంట చేల గట్లు, కోతకు గురైన రోడ్లు, కూలిపోయిన ఇళ్లు, అలుగులు పారుతున్న చెరువులు, కాలువల గట్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడికక్కడ చక్కర్లు కొడుతున్నారు.

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి తీరిక లేకుండా పర్యటిస్తున్నారు. నష్టాన్ని అంచనా వేసి పునరుద్ధరణ చర్యలు తీసుకుంటున్నారు. బాధితులకు భరోసా ఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, నగేశ్‌రెడ్డి, నర్సారెడ్డి సైతం వరుసగా వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

■ నిజామాబాద్ అర్బన్ పరిధిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ వరుసగా పర్యటిస్తున్నారు. వరద ప్రభావానికి గురైన ప్రాంతాలను పరిశీలించడంతో పాటు వారికి అవసరమైన నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. అదేవిధంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నగర అధ్యక్షుడు కేశ వేణు, సయ్యద్ ఖైసర్ తిరుగుతున్నారు. మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సైతం విస్తృతంగా తిరుగుతూ కూరగాయలు, నిత్యావసరాలు అందిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ నగరంలో పర్యటించి సహాయం అందిస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పర్యటిస్తున్నారు.

■ బోధన్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సైతం తిరుగుతున్నారు. అయితే ఎమ్మెల్యే షకీల్ మాత్రం ఇప్పటివరకు నియోజకవర్గంలోకి రాకపోవడం గమనార్హం.

■ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిరంతరం సమీక్షలు చేస్తుండడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వరద నష్టాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు బాల్కొండ నియోజకవర్గంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి విస్తృతంగా తిరుగుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి వరద ప్రాంతాల్లో తిరిగి పరామర్శలు చేస్తున్నారు. ముత్యాల సునీల్‌రెడ్డి అవసరమైనవారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు.



తొర్లికొండలో ధ్వంసమైన రోడ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి



మెంట్రాజ్‌పల్లి కొచ్చెరువు లీకేజీని పరిశీలించి ఇరిగేషన్ ఈఈతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నగరంలో 38వ డివిజన్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

బోడ కాకర @ రూ.400



ఆర్మూర్: వర్షాకాలం మాత్రమే లభించే బోడ కాకరకాయలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. తోపుడు బండ్లపై వ్యాపారస్తులు రూ. 350 నుంచి రూ. 400 కిలో చొప్పున అమ్ముతున్నారు. అయితే సీజన్ దాటిపోతే మళ్లీ దొరకవంటూ బోడ కాకరకాయలను కొనడానికి ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో సహజంగా పండే బోడకాకరను గ్రామీణ ప్రాంత ప్రజలు సేకరించి పట్టణాలకు అమ్మకానికి తీసుకొస్తారు. మరో వైపు కొందరు చిరు వ్యాపారులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో విస్తారంగా పండించే బోడ కాకరకాయలను కొనుగోలు చేసి జిల్లాలో విక్రయిస్తున్నారు. బోడ కాకరకాయలో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయని, తింటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

చేదు ఉండదు..



బోడ కాకరకాయలో చేదు గుణం ఉండదు. పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. వర్షాకాలం తరువాత కావాలన్నా బోడ కాకరకాయలు దొరకవు అందుకే కొనుగోలు చేస్తున్నాము.

– చిరుమల్ల పవన్ కుమార్, ఆర్మూర్ పట్టణం

సీజన్‌లోనే లభిస్తాయి..



బోడ కాకరకాయలు వర్షాకాలం సీజన్‌లో మాత్రమే లభిస్తాయి కాబట్టి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాము. ధరతో సంబంధం లేకుండా ఇష్టంగా కొనుగోలు చేసి తింటున్నాము.

– పద్మ మురళి, ఆర్మూర్ పట్టణం

మంత్రికి అవగాహన లేకే..



మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్

చెక్‌డ్యామ్‌లతో నష్టం

- జిల్లా కేంద్రంలో రూ. 100 కోట్లతో జరిగిన అభివృద్ధి ఎక్కడా..?
- ముంపు ప్రాంతాలను పట్టించుకోని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా
- భారీ వర్షాలపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై ని కలుస్తాం
- మీడియాతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్

ఖలీల్‌వాడి : మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అవగాహన లోపంతోనే పెద్దవాగుపై కట్టిన చెక్ డ్యామ్‌లతో రైతులు పంటలు నష్టపోతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2022లో వర్షాల కారణంగా చెక్ డ్యామ్‌లు తెగిపోయాయన్నారు. మంత్రి కమీషన్ల కోసం 3 కిలోమీటర్ల మేర కట్టాల్సిన చెక్ డ్యామ్‌లను 2 కిలోమీటర్లకు నిర్మించారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని 10,11, 29, 32 డివిజన్‌లే కాకుండా ఇతర ప్రాంతాలలో వరదలతో ముంపునకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, తహసీల్దార్ అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవన్నారు. ఇండ్లలోకి నీరు చేరిన బాధితులకు ఆశ్రయం కల్పించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన డ్రెయినేజీల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి ఎక్కడో స్పష్టం చేయాలన్నారు. ఇసుక పేరుతో బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై నట్లు ఆరోపించారు. రైతులకు రైతేబంధు కాకుండా పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై మంగళవారం రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌లో, యువరాజు ప్రగతిభవన్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. వరద బాధితులకు నష్టపరిహారం, మృతుల సంఖ్య, పంట నష్టపోయిన వివరాలను సోమవారం ప్రకటిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ భూపతిరెడ్డి, ఆరికెల నర్సారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్‌హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవేణు, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు నగేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జావీద్, రాజానరేందర్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, సిరికొండ గంగారెడ్డి పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి గుడ్‌న్యూస్

- ఆర్టీసీ టికెట్లలో పలు రాయితీలు
- ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు
- మహిళలకు ప్రత్యేకం..



ఖలీల్‌వాడి : ఆర్టీసీ ద్వారా ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించేందుకు.. వారి ఆర్థికభారాన్ని తగ్గించేందుకు అధికారులు వివిధ రకాల ప్యాకేజీలను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు అనువుగా ఉండేందుకు టీ9-30, టీ9-60 వంటి పథకాలను తీసుకొచ్చింది. ఆటోల్లో ప్రయాణికులు వెళ్లకుండా పల్లెవెలుగు ద్వారా ప్రయాణం చేయడానికి ఈ పథకాలు ఉపయోగపడుతాయని ఆర్టీసీ భావిస్తోంది. అంతేకాకుండా తిరుపతి, అరుణాచల క్షేత్రంకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్తున్నారు. వీరు టూరిస్టు బస్సులను నమ్మి మోసపోయిన ఘటనలున్నాయి. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తిరుపతి, అరుణాచలం వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

అరుణాచలం గిరి ప్రదర్శనకు..

తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ బస్సులకు సంస్థ నియమ నిబంధనలకు అనుసరించి ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నడుపుతారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి కాలనీల్లో 30 మంది ప్రయాణికులు ఉంటే కాలనీకే బస్సు పంపిస్తారు. దీంతోపాటు కాణిపాకంతో పాటు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరి క్షేత్రం ఉంటుంది. ఈ నెల 30న నిజామాబాద్ నుంచి ప్రారంభించే బస్సును పౌర్ణమి రోజు చేర్చేందుకు ఏర్పాటు చేశారు.

టీ9–30 కి.మీ వెళ్లే వారికి రాయితీ..

రెండు రోజుల క్రితం ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులకు ఆర్థికభారం తగ్గించేందుకు ఆర్టీసీ టీ9–30 పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రూ. 50 చెల్లిస్తే 30 కి.మీ ప్రయాణం చేయవచ్చు. టీ 9 పథకాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమలు ఉపయోగం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించవచ్చు. టీ9 టిక్కెట్లు పల్లెవెలుగు బస్సు కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయి. ఈ టికెట్ తీసుకుంటే ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.30 వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. రూ.20 కాంబోతో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం ఉంది. ఆటోల్లో ప్రయాణించకుండా పల్లెవెలుగు ద్వారా ప్రయాణం చేయడానికి సులువుగా ఉంటుంది.

నిజామాబాద్ నుంచి తిరుపతికి..

గతేడాది ఆర్టీసీ తిరుపతికి ప్రత్యేక దర్శనం కల్పించడానికి బస్సులను ఏర్పాటు చేసింది. జిల్లా నుంచి ప్రతిరోజు తిరుపతి వెంకటేశ్వర దర్శనం చేసుకోవడానికి వెళ్తుంటారు. అయితే ఆర్టీసీ తిరుపతి బస్సు టికెట్‌తో పాటు దర్శనం టికెట్ అందించడంతో ఈ బస్సులో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. జిల్లా కేంద్రం నుంచి తిరుపతికి బస్సులు వెళ్తున్నాయి. తిరుపతికి పెద్దలకు రూ. 3,190 కాగా పిల్లలకు రూ. 2,280 టికెట్ ధర ఉంది. ఈ బస్సులో ప్రయాణించడానికి నెలరోజుల ముందు బుకింగ్ చేసుకుంటే సీటు దొరికే అవకాశాలున్నాయి.

టీ9 టికెట్‌తో 60 కి.మీ వరకు..

ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులకు ఆర్థికభారం తగ్గించడానికి ఆర్టీసీ టీ9–60 పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా రూ.100 చెల్లిస్తే 60 కి.మీ ప్రయాణం చేయవచ్చు. టీ9 పథకాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. టీ9 టికెట్లు పల్లెవెలుగు బస్సు కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయి. ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 20 నుంచి రూ. 40 వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. రూ. 20 కాంబితో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం ఉందన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దైవదర్శనానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రయాణించేవారికి ఆర్టీసీ టీ9–30, టీ9–60 వంటి పథకాలను తీసుకొచ్చింది. ఈ పథకాలతో ప్రయాణించే వారికి ఆర్థికభారం తగ్గుతుంది. ఆటోలలో ప్రయాణించే బదులు బస్సుల్లో ప్రయాణించాలి. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుంది.

– జానీ రెడ్డి, ఆర్ఎం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

క్లుప్తంగా

లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా శనివారం ముప్కాల్ జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ నీటి విడుదలను ప్రారంభించారు. కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువలో అడ్డుకట్టలను తొలగించాలని ఆమె కోరారు. వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ముప్కాల్ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీలు నాయకుడు పద్మ, సత్యనారాయణ, డీఈఈ సురేశ్ పాల్గొన్నారు.

ఒక గేటు ద్వారా అలీసాగర్ నీటి విడుదల

ఎడపల్లి: అలీసాగర్ రిజర్వాయర్‌లోకి ప్రధాన కెనాల్ నుంచి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఒక గేటు ద్వారా అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు.

98 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో 98 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఐసీడీసీ పీడీ రసూల్ బీ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1500 అంగన్‌వాడి కేంద్రాలు ఉండగా, ఇందులో 1365 ప్రధాన కేంద్రాలు, 135 మినీ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 500 జనాభా కలిగిన ప్రతి గ్రామంలో మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రంగా మార్చేందుకు ప్రతిపాదనలు కోరగా, జిల్లాలో 98 కేంద్రాలను మార్చాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు.

సుర్భిర్యాల్‌ను సందర్శించిన కేంద్ర బృందం



పెర్కిట్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామాన్ని స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం సభ్యులు శనివారం సందర్శించారు. స్వచ్ఛ భారత్ కింద చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం సభ్యులు గణేశ్, డీపీఎం మారుతి, సర్పంచ్ సట్లపల్లి సవిత గణేశ్, ఐకేపీ ఏపీఎం గంగారం, ఈజీఎస్ ఏపీవో సురేష్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరదొస్తే.. రాకపోకలు బంద్

- మంజీర ఉధృతి పెరిగితే పాత వంతెన మూసి వేస్తున్న అధికారులు
- నిలిచిపోతున్న అంతర్రాష్ట్ర రవాణా
- వంతెన పటిష్టతపై అనుమానాలు
- కొత్త బ్రిడ్జి పూర్తి కావడానికి మరో ఆరు నెలలు



మంజీర పాత వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

బోధన్: మంజీర ఉధృతంగా ప్రవహిస్తే అంతర్రాష్ట్ర రవాణా నిలిచిపోతుంది. తెలంగాణ – మహారాష్ట్రల మధ్య ప్రధాన వారధి సాలూర మండల కేంద్రం శివారులో గల మంజీరపై గల పాత వంతెన. మంజీరకు భారీగా వరదొస్తే పాత వంతెన నీట మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నెలలోనే రెండు సార్లు భారీ వరదతో వంతెన మునిగి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. మహారాష్ట్ర ప్రాంత అధికారులు వంతెన వైపు వెళ్లే రోడ్డును మూసి వరద తగ్గిన తర్వాత రవాణాకు అనుమతించారు. నిజాం కాలంలో వందేళ్ల క్రితం మంజీర నదిపై లోలెవల్ రాతి వంతెన నిర్మించారు. ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు రవాణ, ప్రజల రాకపోకలకు దశాబ్దాలుగా ఈ వంతెన ఎంతో ఉపయోగపడింది. 2021 సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదతో వంతెన దెబ్బతింది. అప్పుడు వారం పాటు రాకపోకలు నిలిపి వేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు. వంతెన పటిష్టతపై నాందేడ్ జిల్లా జాతీయ రహదారుల విభాగం అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, బైక్‌లు, ప్యాసింజర్ ఆటోలు అధిక సంఖ్యలో వంతెన పైనుంచి రాకపోకలు సాగుతున్నాయి.

హైలెవల్ వంతెనకు పగుళ్లు

పాత వంతెనకు దిగువన 1984–85లో ఉమ్మడి ఏపీ, మహారాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి హై లెవెల్ వంతెన నిర్మించారు. ఈ వంతెన 2017లో దెబ్బతిని పలు చోట్ల పగుళ్లు వచ్చాయి. మహారాష్ట్ర అధికారులు గుర్తించి మరమ్మతులు చేపట్టారు. మళ్లీ రెండేళ్లకు వంతెనకు పగుళ్లు రాగా అధిక బరువు వాహనాల రవాణాపై ఆంక్షలు విధించారు. ప్రమాదకర పరిస్థితికి చేరిందని గుర్తించి 2022 మే నెలలో వంతెనపై రవాణాను పూర్తిగా నిలిపి వేశారు. వంతెనకు ఇరువైపులా గుంతలు తవ్వి మూసివేశారు. వాహనాలను పాత వంతెన మీదుగా మళ్లిస్తున్నారు. అయితే వరద ఉధృతి పెరిగితే పాత వంతెన పదిలమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిర్మాణంలో మరో బ్రిడ్జి

పాత రాతి వంతెన, హై లెవెల్ వంతెనల మధ్య కొత్తగా మరో బ్రిడ్జి నిర్మాణాన్ని ఏడాది క్రితం చేపట్టారు. మహారాష్ట్ర ప్రాంతం 63వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా దీనిని నిర్మిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించింది. వరద కారణంగా వంతెన పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. వంతెన పనులను పూర్తిగా మహారాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. ఈ వంతెన పూర్తి కావడానికి మరో ఆరు నెలలు పట్టవచ్చని తెలుస్తోంది. ఈ బ్రిడ్జి పూర్తయితే అంతర్రాష్ట్ర రవాణా మరింత సాఫీగా మారే అవకాశం ఉంటుంది.



మూసి వేసిన హైలెవల్ వంతెన



నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి

గెస్ట్ లెక్చరర్‌లకు లైన్ క్లియర్

- డిగ్రీ కాలేజీల్లోని అతిథి అధ్యాపకులను కొనసాగించాలి
- ఉత్తర్వులను జారీ చేసిన ఉన్నత విద్యాశాఖ

మోర్తాడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ అధ్యాపకులను రెన్యూవల్ చేసిన మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోని గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డిగ్రీ కళాశాలల్లోని గెస్ట్ అధ్యాపకులను రెన్యూవల్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. విద్యాశాఖ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 100 మంది గెస్ట్ అధ్యాపకులకు ఊరట లభించింది. గెస్ట్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరిగా రెన్యూవల్ చేయకుండా ప్రతి విద్యాసంవత్సరంలో ఇంటర్వ్యూలను నిర్వహించి కొత్తగానే విధుల్లోకి తీసుకునేవారు. ఈ విధానంతో అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లభించక వారిలో ఆందోళన నెలకొంది. పేరుకే అతిథి అధ్యాపకులమైనా రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరిగానే తాము కూడా కళాశాలల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వారు హైకోర్టుకు విన్నవించారు. ప్రతి సంవత్సరంలో మౌఖిక ఇంటర్వ్యూలను నిర్వహించే విధానానికి స్వస్తి పలకాలని హైకోర్టు తలుపు తట్టడంతో న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. మొదట జూనియర్ కళాశాలల అధ్యాపకులు హైకోర్టును ఆశ్రయించి రెన్యూవల్ ఉత్తర్వులను అందుకున్నారు. వారి మార్గంలోనే డిగ్రీ కళాశాలల అధ్యాపకులు కూడా ఇటీవల హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో, అందుకు అనుగుణంగా ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వాకా టి కరుణ రెన్యూవల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇటీవల గెస్ట్ అధ్యాపకుల పోస్టుల భర్తీకి ఆయా డిగ్రీ కళాశాలలు నోటిఫికేషన్ జారీ చేశాయి. ఇంటర్వ్యూలను నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాలతో వాయిదా పడింది. చివరకు గతంలో గెస్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారినే కొనసాగించాలని ఉత్తర్వులు వెలువడంతో వారికి ఊరట కలిగినట్లు అయింది.

ఆర్టీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీసు ఏర్పాటు చేస్తాం



యువకులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: బాల్కొండ నియోజవర్గంలో త్వరలో శాశ్వత ఆర్టీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీసు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన వేల్పూర్ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో బాల్కొండ నియోజకవర్గ యువతి, యువకుల కోసం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించే కార్యక్రమంలో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్లాట్ బుకింగ్, లెర్నింగ్ లైసెన్స్ అందజేసే ఆర్టీవో ఎక్స్‌టెన్షన్ ఆఫీసును ప్రారంభించారు. కంప్యూటర్లు, స్లాట్ బుకింగ్ సిస్టమ్, లైసెన్స్ జారీ చేసే ప్రక్రియను పరిశీలించారు. స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన యువతీ,యువకులతో మంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్మూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, నియోజకవర్గంలో దూర ప్రాంతాల మండలాల ప్రజలకు అది అసౌకర్యంగా ఉందన్నారు. అందుకే బీఆర్‌ఎస్ తరపున సొంత ఖర్చులతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవ్ చేపట్టామని పేర్కొన్నారు. నియోజకర్గంలోని గ్రామాల యువత నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. ఇప్పటికే సుమారు 7 వేల మంది యువకులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిరోజు 400 నుండి 500 మందికి స్లాట్ బుకింగ్ జరిగే అవకాశం ఉన్నందున, అదేరోజు వారికి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసే అవకాశం కల్పించాలని జిల్లా రవాణాశాఖ అధికారికి మంత్రి సూచించారు. ఆర్మూర్ ఆర్టీవో ఆఫీసుకు వెళ్లే ఇబ్బంది లేకుండా వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎక్స్‌టెన్షన్ ఆఫీసు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను అడిగిన మూడు గంటల్లోనే అనుమతి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మధుశేఖర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్మూర్ ఎంవీఐ వెంకటస్వామి, జిల్లా ఆర్టీఏ సభ్యుడు రేగుల్ల రాములు, మిట్టపల్లి మహిపాల్, ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ద్యావతి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం అందించరూ!

- కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు
- వైద్యానికి రూ.ఐదు లక్షలు అవసరం
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



చికిత్స పొందుతున్న చిన్నారి

మాచారెడ్డి: పుట్టిన కొడుకును చూసి మురిసిపోతున్న ఆ పేద తల్లిదండ్రులకు పెద్ద కష్టం వచ్చింది. కుక్కల దాడిలో బాబు గాయపడటంతో వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోరుతున్నారు. మాచారెడ్డి మండలం అంకిరెడ్డిపల్లి తండాకు చెందిన బానోత్ జ్యోతి, సురేశ్ దంపతులకు నెల క్రితం కుమారుడు జన్మించాడు. రెండు రోజుల కిందట ఇంట్లో నిద్రిస్తున్న బాబుపై కుక్కలు దాడి చేశాయి. ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇప్పటికే రూ.నాలుగు లక్షలు ఖర్చయ్యాయి. మరో రూ.ఐదు లక్షల వరకు అవసరం అవుతాయని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ తల్లిదండ్రులు సాయం కోసం వేడుకుంటున్నారు. దాతలు 7013129003, 6301089588 నంబర్లకు ఫోన్ పే ద్వారా సాయం అందిచాలని కోరారు.

రేషన్ బియ్యం పంపిణీకి నేటి వరకు గడువు

సుభాష్‌నగర్: జిల్లాలో ప్రజాపంపిణీ బియ్యం పంపిణీ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో డీలర్లు, కార్డుదారుల విజ్ఞప్తి మేరకు ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలకు సంబంధించి బియ్యం కోటా రేషన్ దుకాణాలకు ఆలస్యంగా చేరడం, వర్షాలు ఎడతెరపి లేకుండా కురవడంతో గడువును 29వ తేదీవరకూ పొడగించిన విషయం తెలిసిందే. తాజాగా బియ్యం పంపిణీకి మరో రోజు గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వరకూ వందశాతం పంపిణీ పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు.

‘మంత్రి కమీషన్ల కక్కుర్తికి రైతులు బలి’



సుంకెట్‌లో బాధిత రైతులతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్: మంత్రి ప్రశాంత్‌రెడ్డి కమీషన్ల కక్కుర్తికి మోర్తాడ్ మండలంలోని సుంకెట్‌కు చెందిన రైతులు బలి పశువులుగా మారారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆరోపించారు. పటిష్టంగా ఉండాల్సిన చెక్‌డ్యాంలు ఒకటి రెండు రోజుల వర్షానికి కోతకు గురి కావడం చూస్తుంటే ఇంజినీర్ల వైఫల్యం ఎంతో ఉందన్నారు. దీనికి మంత్రి, ఇంజినీర్లు బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సుంకెట్‌లో చెక్‌డ్యాంకు కోత ఏర్పడి నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. రెండు వాగులు కలిసే చోట చెక్‌డ్యాం నిర్మించడం తప్పని, అందులోను నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వందలాది ఎకరాల్లో నీరు ప్రవహించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గతంలోను ఒకసారి చెక్‌డ్యాం కోతకు గురికాగా మరోసారి కోత ఏర్పడి మంత్రి, ఇంజినీర్ల వైఫల్యాలను నిరూపించిందన్నారు. బాధిత రైతులకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు, బద్దం రాజశేఖర్, వేణురాజ్, సుధీర్, అశోక్, దేవేందర్, గంగారెడ్డి, బూత్‌పురం మహిపాల్, రవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెట్లు నరికిన వారిపై కేసు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని తిమ్మాపూర్ తండా అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి ఓంకార్ శనివారం తెలిపారు. తిమ్మాపూర్ తండాకు చెందిన కాట్రోత్ తాక్యాతో పాటు మరి కొందరు అటవీ ప్రాంతంలో చెట్లను నరుకుతున్నారన్న సమాచారం మేరకు వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. చెట్ల నరికి ఉండడంతో తాక్యాతో పాటు మరి కొందరిపై అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడంతో పాటు వీరిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు.

దాడి చేసిన ఆటోడ్రైవర్లపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్ద బజార్‌లో నడుచుకుంటూ వెళ్తున్న యాదగిరి అనే వ్యక్తిపై ఓ ఆటో డ్రైవర్ దాడి చేశాడు. దీంతో యాదగిరి వెంటపడి నెహ్రూ పార్క్ వద్ద పట్టుకొని ప్రశ్నించగా అక్కడే ఉన్న మరో డ్రైవర్ దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

ఆటో చోరీ కేసులో ఒకరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ గురుకృప సూపర్ మార్కెట్ ముందు నుంచి ఆటోను ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏప్రిల్ 18న గురుకృప సూపర్ మార్కెట్ ఎదుట అమృతం కాశీరాం తన ప్యాసింజర్ ఆటోను నిలిపి ఉంచాడు. తర్వాత వచ్చి చూసే సరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం కొయ్యగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో వర్ని మండలం సేవలాల్ తండాకు చెందిన మెగావత్ దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి దొంగిలించిన ఆటోను తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు.

వరకట్నం కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్పలో శుక్రవారం సాయంత్రం మౌనిక ఆత్మహత్య చేసుకున్న కేసులో మృతురాలి తల్లి బాగున్నా ఫిర్యాదు మేరకు భర్త సాయికుమార్, అత్త నవనీతపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము శనివారం తెలిపారు. సాయికుమార్, మౌనికకు రెండేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచే అదనపు కట్నం కోసం సాయికుమార్ వేధించేవాడు. గతంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఇరువురిపై వరకట్నం కేసు నమోదు చేశారు. మృతురాలి బంధువుల ఆందోళన నేపథ్యంలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ వెంకట నారాయణ, ఎస్సై రాము పరిస్థితి అదుపు చేశారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



ఆర్మూర్‌టౌన్: పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏసీపీ జగదీశ్‌చందర్ సూచించారు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌ను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ శనివారం సందర్శించారు. గంజాయి రవాణా, పేకాట, చోరీలను అరికట్టాలన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తెలతాడు కోసం దంపతుల హత్య

- కేసు ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు యువకులు పుస్తెల తాడు కోసం వృద్ధ దంపతులను హతమార్చారు. బీర్కూర్ మండలం రైతునగర్‌లో దంపతుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న రైతు నగర్‌లో కిరాణ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్న దారం నారాయణ (75), దారం సులోచన (70) దంపతులు హత్యకు గురయ్యారు. మృతుడి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్పీ తెలిపారు. శనివారం దామరంచ గ్రామానికి చెందిన బంగ్లా చింటూ అలియాస్ చరణ్, అతని తండ్రి బంగ్లా లక్ష్మణ్ బీర్కూర్‌లోని బంగారు దుకాణంలో పుస్తెల తాడును విక్రయించే ప్రయత్నం చేయగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా చింటూ తన స్నేహితుడైన ఎర్రోళ్ల నవీన్‌తో కలిసి నారాయణ, సులోచనలను హత్య చేసినట్లు అంగీకరించాడని ఎస్పీ చెప్పారు. పేకాటతో పాటు ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డా చింటూ, నవీన్ అప్పుడప్పుడు నారాయణ దుకాణానికి వెళ్లేవారని, సులోచన మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశారన్నారు. అందులో భాగంగా ఘటన జరిగిన రోజు నిందితులు నారాయణ ఇంటి వెనుకాల నుంచి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించారన్నారు. ముందుగా సులోచనను హత్య చేశారని, అనంతరం ముందు గదిలో టీవీ చూస్తున్న నారాయణ వద్దకు వెళ్లి ఆయనను కూడా చంపేశారన్నారు. సులోచన మెడలో ఉన్న మూడు తులాల బంగారం పుస్తెల తాడును ఎత్తుకెళ్లారని చెప్పారు. పుస్తెల తాడును మూడు ముక్కలు చేసి చింటూ, లక్ష్మణ్, నవీన్ పంచుకున్నారన్నారు. పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని చింటూ, నవీన్‌తో పాటు లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. నవీన్, లక్ష్మణ్‌పై గతంలో పలు కేసులు ఉన్నాయన్నారు. కేసును ఛేదించిన డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, పిట్లం, నస్రుల్లాబాద్ ఎస్సైలు విజయ్, రంజిత్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్సై రాములు, సీసీఎస్ ఏఎస్సై రాజేశ్వర్, హెచ్‌సీ సురేందర్, కానిస్టేబుళ్లు, సుభాష్, వస్సీ, సంగమేశ్వర్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

బోధన్‌లో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై పీటర్

బోధన్‌టౌన్: బోధన్‌లోని గౌడ్స్ కాలనీలోని ఓ ఇంట్లో శనివారం పట్ట పగలే చోరీ జరిగింది. తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌడ్స్ కాలనీలో నివాసం ఉంటున్న హన్మంత్‌రావు పటేల్ పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఆయన భార్య హైదరాబాద్ బంధువుల ఇంట్టికి వెళ్లగా శనివారం ఉదయం హన్మంత్‌రావు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తాళం పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పీటర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫిట్స్ వచ్చి దాబాపై నుంచి పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి బీసీ కాలనీలో ఫిట్స్‌తో దాబాపై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ శనివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముండే ధర్మేందర్ (34) బట్టలను తీసుకుని వచ్చేందుకు ఇంటి దాబాపైకి వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య లక్ష్మి ఇంటి పైకి వెళ్లి చూడగా ఇంటి వెనకాల గల మురికి కాలువలో ధర్మేందర్ పడి ఉన్నాడు. కిందకు వెళ్లి చూడగా ఆయనలో కదలికలు లేకపోవడంతో వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి ధర్మేందర్ ఫిట్స్‌తో మృతి చెందినట్లు చెప్పారని ఎస్సై తెలిపారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నందిపేట్: నందిపేట మండలం ఖుద్వాన్‌పూర్ చెరువు అలుగు వద్ద మూడు రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కొల్హూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లప్ప(35) అదే గ్రామానికి చెందిన ఐదుగురితో కలిసి గురువారం ఉదయాన్నే షాపూర్ శివారులో గల ఖుద్వాన్‌పూర్ చెరువు అలుగు దగ్గర చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఎల్లప్పతోపాటు మరో వ్యక్తి దుర్గయ్య అలుగులోకి దిగగా ప్రవాహం ఉధృతంగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నంలో ఇద్దరు కొట్టుకుపోయారు. దుర్గయ్య కొద్ది దూరం కొట్టుకుపోయి ప్రాణాలతో బయట పడగా ఎల్లప్ప గల్లంతయ్యాడు. దీంతో తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. కాగా శనివారం నీటిలో మృతదేహం తేలింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజేందర్ తెలిపారు.

ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మిపై కేసు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. వివరాలు.. జూన్ 23న ఆకుల కొండూర్ గ్రామం చెరువులో నుంచి సర్పంచ్ అశోక్, గ్రామస్తులు కొందరు మట్టి తీస్తున్నారనే సమాచారంతో ఏఈ అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ తమ గ్రామ తీర్మానం మేరకు చెరువులో నుంచి గ్రామంలో నిర్మిస్తున్న మహాలక్ష్మీ ఆలయానికి, పంట పొలాలకు మట్టిను తీసుకెళ్తున్నటు చెప్పారు. ఈ ఘటనలో ఏఈ, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా ఏఈ సర్పంచ్, కొందరు గ్రామస్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యా దు చేశారు. అనంతరం ఏఈకు బాసటగా ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి విషయాన్ని తెలిపారు. కలెక్టర్ జోక్యంతో సర్పంచ్‌పై, కొందరు గ్రామస్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు సర్పంచ్ ఏఈపై ఫిర్యాదు చేయగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో కేసు నమోదు చేయకుండా కోర్టు అనుమతి కోసం పంపారు. కోర్టు నుంచి అనుమతి రాగానే ఏఈపై ఐపీసీ సెక్షన్లు 304, 306 కింద కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో శనివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు ఏఎస్సై వెంకన్న తెలిపారు. మల్లారంలో గత మూడురోజులుగా భిక్షాటన చేస్తూ శనివారం ఉదయం ఓ చెట్టుకింద పడుకుని అక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్లేవారు గమనించి సర్పంచ్ నగేష్‌కు తెలిపారు. సర్పంచ్ విషయాన్ని రూరల్ పోలీసులకు తెలుపటంతో ఏఎస్సై వెంకన్న అక్కడకు చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి

రాజంపేట: రాజంపేటలోని ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వారి నుంచి రూ.49,400 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.